క్లుప్తంగా

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టలో ఆదిమూలపు



విగ్రహం వద్ద దుస్తులు పంపిణీ చేస్తున్న సురేష్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సెంటర్లో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గురువారం 41 రోజుల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుస్తులు పంపిణీ చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రత్యేక పూజలు చేశారు. దగ్గుమాటి బూసిరెడ్డి, దగ్గుమాటి శంకరరెడ్డి, నాగినేని భాస్కర్, నారాయణరెడ్డి, పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, షేక్ పటేల్, షేక్ అల్లాభక్షు పాల్గొన్నారు.

దశదినకర్మలో మాజీ మంత్రి సురేష్



పార్థసారథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: మండలంలోని పెరిదేపి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గంటినపల్లి రవిచంద్ర ప్రసాద్ సోదరుడు, ఐటీసీ ఉద్యోగి గంటనపల్లి విజయ పార్థసారథి గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి, సానుభూతి తెలియజేసి, ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, సీనియర్ నాయకులు మండవ మాలకొండయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ విజయ రామరాజు, భీమనాథం వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ షేక్ నాగూల్ మీరా

హనుమంతునిపాడు: రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ షేక్ నాగూల్ మీరా అన్నారు. మండలంలో విరగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే జరిగే సమయంలో భూమి యజమాని పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు చూయించి సర్వే చేయించుకోవాలన్నారు. ఆర్ఐ చైతన్య, వీఆర్వోలు పరుశురాం, నాగార్జున్, ఎస్, కాశయ్య, జేమ్స్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న ఎక్సైజ్ డీసీ హేమంత్ నాగరాజు

సింగరాయకొండ: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న డి.సుబ్బారావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఒంగోలు ఎక్సైజ్ డీసీ హేమంత్‌నాగరాజు, సూపరింటెండెంట్ షేక్ ఆయేషాబేగం, ఏఈఎస్ వెంకట్‌లు సుందర్‌నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో సుబ్బారావు మృతదేహానికి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి, డిస్టిలరీ సీఐ సుందరరామయ్య, ఎస్సై టి.రాజశేఖర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల తనిఖీ

సీఎస్‌పురం(పామూరు): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌డీఓ, ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కంభంపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. కేంద్ర నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొడిచెత్త, తడిచెత్తను వేర్వేరుగా కేంద్రంలో వేయాలని, తడిచెత్త నుంచి వర్మీకంపోస్ట్ తయారీకి చొరవ తీసుకోవాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం, ఓవర్‌హెచ్ ట్యాంకుల నిర్వహణపై పలు సూచనలు చేశారు.



ఉలవపాడు ప్రభుత్వ వైద్యశాల



బుధవారం రాత్రి 10.30 గంటలకు సిబ్బంది లేని ఎమర్జెన్సీ వార్డు



వైద్యశాల ఓపీ, మెయిన్ ఎంట్రెన్స్‌లో కనిపించని ఉద్యోగులు

ప్రభుత్వ వైద్యశాలలకు అనారోగ్యం

- రోగులను చూసే దిక్కెవరు?
- పేరుకే 24 గంటల వైద్యం
- రాత్రి వేళ వైద్య సిబ్బంది కరువు

ఉలవపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలూ వైద్యం అందించాలి. ప్రమాదాల కేసులను అత్యవసరంగా చూడాలి. స్పెషలిస్టు వైద్యులతో నాణ్యమైన వైద్యం అందించాలి. ప్రమాద కేసులకు వెంటనే స్పందించాలి. 108 వాహనం క్షతగాత్రులను తీసుకొచ్చిన క్షణాల్లో వైద్యం అందించాల్సిన వైద్యశాల నిర్లక్ష్యానికి మారుపేరుగా నిలుస్తోంది. ఉదయం ఓపీ సమయంలో కొద్దిమేర వైద్యులు సేవలు అందిస్తున్నా ఆ తర్వాత పూర్తిస్థాయి నిర్లక్ష్యం కనిపిస్తోంది. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో స్థానిక ఓ వ్యక్తి అస్వస్థతకు గురై వైద్యశాలకు వెళ్లాడు. సిబ్బంది ఒక్కరు కూడా వైద్యశాలలో లేరు. సెక్యూరిటీ వైద్యశాలలో నిద్రపోతున్నాడు. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు అటెండర్లు ఉండాలి. ఒక్కరూ లేరు. సదరు పేషెంట్‌కు సంబంధించిన వ్యక్తులు దాదాపు 20 నిమిషాలు ఉన్నా కనీసం ఒక్కరూ రాలేదు. వెంటనే ఉలవపాడులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం తీసుకున్నాడు. దాదాపు 20 నిమిషాల పాటు వైద్యశాలలో ఉన్నా ఒక్కరు కూడా రాలేదంటే ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమైపోతోంది. వైద్యశాలకు దొంగలు వచ్చి వైద్య సామగ్రిని ఎత్తుకెళ్లినా కూడా పట్టించుకునే వారు లేరని బుధవారం రాత్రి ప్రజలకు అర్థమైంది. పేదలకు వైద్యం అందించాల్సిన వైద్యశాలలో ఇంత దారుణ పరిస్థితి ఉండటం బాధాకరమని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఖాళీగా నర్సుల రూమ్, వార్డు బయట పరిస్థితి ఇలా..



నిద్రపోతున్న వాచ్‌మన్

పట్టించుకునేవారేరి?

ఉలవపాడు వైద్యశాల గురించి పట్టించుకునే వారు లేకుండాపోయారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించకుండా కేవలం రిజిస్టర్‌లో సంతకాలు పెట్టించుకోవడంతోనే సరిపోయింది. అభివృద్ధి కమిటీ సభ్యులు ఏ పోస్టు ఖాళీగా ఉందా, తమ బంధువులను నియమించుకుందామనా అనే రాజకీయం తప్ప వైద్యశాల అభివృద్ధి గురించి కనీసం పట్టించుకోలేదు. ఇటీవల వైద్యశాల పనితీరు బాగాలేదని, అధ్వాన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక్కసారి కూడా వచ్చి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. గతంలో ఉన్న ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి క్రమం తప్పకుండా ప్రతి నెలా 10వ తేదీలోపు సమావేశం నిర్వహించేవారు. దీంతో వైద్యులు, సిబ్బంది కూడా బాధ్యతగా పనిచేసేవారు. అంతేకాకుండా ఇప్పుడు వైద్యశాల సూపరింటెండెంట్‌గా ఉన్న హరీష్ సైతం ఎమ్మెల్యే సొంత సామాజికవర్గం కావడంతో వైద్యశాల పరిస్థితి దారుణంగా ఉన్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వైద్య సిబ్బంది గైర్హాజరైనా, సిబ్బందిపై ఆరోపణలు వచ్చినా సూపరింటెండెంట్ ఉన్నతాధికారులకు తెలియకుండా కాపాడుతున్నారని, అందుకే సిబ్బందిలో నిర్లక్ష్యం పెరిగి వైద్యశాలకు ఎగనామం పెట్టే పరిస్థితికి వచ్చారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్య సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వైద్యశాల పరిస్థితి దయనీయంగా మారిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మూడేళ్ల క్రితం జిల్లాలో వైద్యసేవలో నంబర్ వన్‌గా ఉన్న ఉలవపాడు వైద్యశాల ఇప్పుడు ఎవరైనా రోగులు వస్తే చూసే మనిషి కూడా లేని పరిస్థితికి దిగజారిపోయింది. ఉలవపాడు వైద్యశాలకు కూడా ఉన్నతాధికారులు వైద్యం చేసి బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాఘవులకు దద్దాల పరామర్శ



రాఘవులను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కందుర్లగుంట అగ్రహారం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లా రాఘవులు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న చల్లా రాఘవులను వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ వైద్యశాలకు వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ చీర్లదిన్నె లక్ష్మీనారాయణ, బసివి చంద్రశేఖర్, సైకం ఏడుకొండలు, బోడె కొండారెడ్డి పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగూల్ మీరా

హనుమంతునిపాడు: ఈ క్రాప్ నమోదుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటను పొలం వద్దకు వెళ్లి పరిశీలించి ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదులో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చేయాలన్నారు. ఏఓ రవికుమార్, ఆర్ఐ చైతన్య, వీఏఓ గోపీ, వీఏఏలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఆదిమూలపు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

కొండపి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం, బాబు షూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి పలువురు మాజీ మంత్రులు హాజరు కానుండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూమపు సురేష్ గురువారం స్థానిక నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నామని, అనంతరం మండల స్థాయి, గ్రామస్థాయి కార్యక్రమాలను ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ వెంకయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, మాజీ జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వసంతరావు, సీనియర్ నాయకులు మండల మాలకొండయ్య, బొక్కిసం సుబ్బారావు, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్లు మసనం వెంకట్రావు, బచ్చల కోటేశ్వరరావు, మల్లికార్జునరెడ్డి, పిన్నిక శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



పొన్నలూరులో మార్కుల పత్రం అందజేస్తున్న తహసీల్దార్ పుల్లారావు

పొన్నలూరు: విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి అనుకున్న లక్ష్యాలు సాధించాలని తహసీల్దార్ పుల్లారావు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల, మండలంలోని అన్ని జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి సన్మార్గంలో నడిచి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం జూనియర్ కళాశాల విద్యార్థులకు మార్కుల పత్రం అందజేశారు. ఎంపీడీఓ సుజాత, ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

199 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు వైస్ చైర్మన్ బ్రహ్మయ్య



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి:

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 840 బేళ్లు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ముప్పవరం, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 1039 బేళ్లను వేలానికి తీసుకురాగా 199 పొగాకు బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట 160, సరాసరి ధర రూ.214.65గా నమోదైంది. వేలంలో 25 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య సందర్శించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రోజు రోజుకి సరాసరి ధర పడిపోతోంది. దీనికి తోడు లోగ్రేడు పొగాకు తిరస్కరణకు గురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం వేలం కేంద్రానికి తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1035 బేళ్లను తీసుకురాగా 830 బేళ్లను కొనుగోలు చేసి 205 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.212.61గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



కనిగిరి ఆలయంలో విశిష్ట పూజలు



పామూరు బాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆలకూరపాడులో ప్రత్యేక అలంకరణలో బాబా

కనిగిరిరూరల్: గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అఖండ సాయి నామ సప్తాహం, గురుపౌర్ణమిలు పురస్కరించుకుని ఆలయంలో జరిగిన విశిష్ట పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు పర్యవేక్షణలో హారతులు, అభిషేకాలు, సామూహిక పూజలు నిర్వహించారు. లక్ష పుష్పార్చనలో వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అలాగే పల్లకి సేవా కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు. పూజల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ముక్కు, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ నాయకులు సత్యాలు, బాలు ఓబుల రెడ్డి, బోయళ్ల తిరుపతిరెడ్డి, ముచ్చర్ల ధర్మరావు, మారుతీ, వాగిచర్ల వెంకటేశ్వర్లు, వీసీ రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు.

పామూరు: గురుపౌర్ణమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. పామూరుతో పాటు కొత్తపల్లె, తూర్పు కట్టకిందపల్లె గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని పోస్టాఫీసువద్ద ఉన్న సాయిబాబా, వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న సాయిబాబా ఆలయాల్లో అర్చకులు వేదమంత్రాలతో బాబా మూలవిగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సాయినాథుని ఉత్సవమూర్తికి పుష్పార్చన నిర్వహించారు. మదన వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రవేళ సాయినాథుని ఉత్సమూర్తికి ఊంజల్ సేవ కనులపండువగా సాగింది. పోస్టాఫీసు వద్ద ఉన్న దేవస్థానంలో ఆలయ చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కేసీపీ సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇందిరాదత్తు ఆర్థిక సాయంతో 4 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ సోమిశెట్టి మాల్యాద్రి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

టంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జమ్ములపాలెం, ఆలకూరపాడు కాకుటూరివారిపాలెం, టంగుటూరు, ఎం. నిడమానూరు గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు వేదమంత్రాలతో సాయిబాబా ఆలయంలో ఉదయం స్వామికి పంచామృత అభిషేకం, సామూహిక గురుపూజ, అర్చనలు, హోమాలు నిర్వహించి హారతి అందించి పూలతో అలంకరించారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

సింగరాయకొండ: ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ దిశానిర్దేశం చేశారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని, అప్పుడే అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించగలరన్నారు. గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై పలు సూచనలు చేశారు. అనంతరం షిర్డీ సాయి మందిర్‌లో గురుపౌర్ణమి వేడుకల్లో ఎస్పీ పాల్గొని పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా ఉదయం బాబాకు పాలాభిషేకం, సామూహిక సాయి చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి పల్లకి సేవ నిర్వహించారు.

కమిషనర్‌ను సన్మానించిన పాలక మండలి



కమిషనర్‌ను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

కనిగిరిరూరల్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ పిల్లి కృష్ణ మోహన్‌రెడ్డిని చైర్మన్ ఛాంబర్‌లో పాలకమండలి సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీలో తక్షణం, సత్వరం పరిష్కరించాల్సిన పలు సమస్యలను, అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, రాచపూడి మాణిక్యరావు, దేవకి సత్యావతి, దేవకి రాజీవ్, వై దేవరాజ్, రామనబోయిన శ్రీను, పులి శ్రీను, ఎస్కే షఫీ జాస్మిన్, చొప్పరపు తిరుపతయ్య, పసుపులేటి అరుణోధర్ తదితరులు పాల్గొన్నారు.